



# కరపత్రం

SINCE 2014

గురువారం జూలై 03 2025 సంపుటి :0 సంచిక :258 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4


# తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నాం




- హెల్త్ టూరిజం హబ్‌గా హైదరాబాద్ అభివృద్ధి
- కార్పోరేట్ ఆస్పత్రులతో పోటీగా ప్రభుత్వాసుపత్రులు
- బంజరాహిల్స్‌లో ఎఐజి ఆస్పత్రిని ప్రారంభించిన సిఎం
- నాగేశ్వర్ వైద్య సేవలను అభినందించిన రేవంత్

రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు నిర్మాణంలో ఉన్నాయని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులతో పోటీపడి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందిస్తామని స్పష్టంచేశారు .ఒకప్పుడు ఉన్న ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థపోయి ఇప్పుడు స్పెషలిస్ట్ డాక్టర్స్ రోజులు వచ్చాయన్నారు. హెల్త్ ప్రొఫైల్ క్రియేట్ చేయడం ద్వారా దీన్ని బ్రేక్ చేయొచ్చని సీఎం అన్నారు. ప్రపంచ దేశాలతో పోటీ పడగలుగుతున్నామని చెప్పడానికే మిస్ వరల్డ్ పార్టిసిపెంట్స్‌కు ఏఐజీ హాస్పిటల్ విజిట్ లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. గరంలోని బంజారాహిల్స్‌లో ఏఐజీ ఆస్పత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. నగర ప్రజలకు రెండో అతిపెద్ద హాస్పిటల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినందుకు డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని అభినందించారు. హైదరాబాద్, తెలంగాణకు నాగేశ్వర్ రెడ్డి గొప్ప పేరు తీసుకొచ్చారని.. ఆయన సేవలను గుర్తించి కేంద్రప్రభుత్వం పద్మవిభూషణ్ ఇచ్చిందని తెలిపారు. నాగేశ్వర్ రెడ్డి భారతరత్నకు అర్హులన్నారు. ఆయనకు భారతరత్న వచ్చేలా తెలంగాణ నుంచి తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు. 66 దేశాల నుంచి పేషంట్స్ ఏఐజీ ఆసుపత్రిలో చికిత్సకు వస్తున్నారని ఇది గర్వకారణమన్నారు. 2లో..

## దేశానికి మోడల్‌గా తెలంగాణ డిజాస్టర్ మేనేజిమెంట్


2లో..

- తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ పునర్వ్యవస్థీకరణ
- దీపరివాహక ప్రాంత నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు
- రెవెన్యూ,సమాచార పౌరసంబంధాల శాఖమంత్రి పొంగులేటి

## పట్టణ కూలీలకు 'ఆత్మీయ భరోసా' ఎందుకు వర్తింపజేయట్లేదు?: హైకోర్టు


2లో..

## బిసి రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు

17న రైలురోకో చేసి తీరుతాం
ఖమ్మంలో పోస్టర్ ఆవిష్కరించిన కవిత


2లో..

## నార్సింగి పీఎస్ పరిధిలో హెరాయిన్ స్వాధీనం





హైదరాబాద్: నగర శివారు నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో హెరాయిన్‌ను ఎస్‌వోటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూ. 1.10కోట్ల విలువైన 650 గ్రాముల హెరాయిన్‌ను పట్టుకున్నారు. రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు తరలించినట్లు పోలీసులు గుర్తించారు. రాజస్థాన్‌కు చెందిన రాజారాం ఈ హెరాయిన్‌ను విక్రయిస్తున్నట్లు నిర్ధరించారు. ఒకరిని అదుపులోకి తీసుకుని నార్సింగి పోలీసులకు ఎస్‌వోటీ పోలీసులు అప్పగించారు.



# చేనేత కార్మికుల రుణమాఫీకి 33 కోట్లు

## 5691 మంది చేనేత కార్మికులకు లబ్ధి

పరిపాలన అనుమతులు జారీచేసినట్లు మంత్రి తుమ్మల వెల్లడి



ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు, చేనేత కార్మికులకు లక్ష వరకు రుణమాఫీ కోసం రూ. 33 కోట్లకు పరిపాలన అనుమతులు జారీ చేయడం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. దీంతో 5,691 మంది చేనేత కార్మికులకు లబ్ధి చేకూరుతుందని ఆయన అన్నారు. ఇంతకుముందు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం 2017 ఏప్రిల్ 1వ తేది నుండి 2024 మార్చి 31 వరకు అన్ని బ్యాంకులు మరియు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల్లో చేనేత వస్త్రాల ఉత్పత్తి, వృత్తి సంబంధిత కార్యకలాపాల కోసం తీసుకొన్న రూ. లక్ష వరకు రుణాల (అసలు, వడ్డీ కలిపి)కే మాఫీ వర్తిస్తుందని మంత్రి తెలిపారు. మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాల వారిగా లబ్ధిదారుల వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగు తుందని, 2లో..

## రాష్ట్రానికి తగిన యూరియా కేటాయించండి

కేంద్రానికి లేఖ రాసిన మంత్రి తుమ్మల

2లో..

## క్రీడా జర్నలిస్ట్ దినోత్సవం సందర్భంగా బొబ్బిలి నర్సయ్య అజ్మత్ లకు సన్మానం



**కరపత్రం ప్రతినిధి నిజామాబాద్ స్పోర్ట్స్,జూలై 02 :**
జిల్లా ఫిజికల్ డైరెక్టర్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అసోసియేషన్ అధ్యక్షులు నాంచారి శ్రీనివాస్,రంగు కృష్ణంరాజు ఆధ్వర్యంలో క్రీడా పాత్రికేయ రంగంలో విశిష్ట సేవలందించిన బొబ్బిలి నర్సయ్యా,అజ్మత్ లను ఘనంగా సన్మానం చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ,క్రీడా జర్నలిస్టులు క్రీడా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని,వారి కృషి వల్ల క్రీడలు ప్రజల్లోకి చేరుతున్నాయని నాంచారి శ్రీనివాస్,రంగు కృష్ణంరాజు అన్నారు.క్రీడాకారుల విజయాలను ప్రపంచానికి తెలియజేసే వారే జర్నలిస్టులు అని పేర్కొంటూ,గురువారం రోజున ఈ సన్మానం అందుకున్న బొబ్బిలి నర్సయ్యా,అజ్మత్ ల సేవలు ప్రశంసనీయమని తెలిపారు.ఈ సన్మాన కార్యక్రమంలో భూమారెడ్డి మోహన్,నాంచారి శ్రీనివాస్,అబ్బయ్యా,వెంకటేశ్వరరావు,రంగు కృష్ణంరాజు,ఆగుట్ల రమేష్,స్వామి కుమార్, కృష్ణమూర్తి,వినోద్ రెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరమార్శించిన మానాల



**కరపత్రం ప్రతినిధి ఏర్గట్ల,జులై 02 :**
ఏర్గట్ల మండలంలోని తాడపాకల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు జింక అనిల్ యాదవ్ తండ్రి ఇటీవల మరణించడంతో అయన కుటుంబ సభ్యులను తెలంగాణ రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి బుధవారం రోజున పరామర్శించారు.ఆయన వెంట ఏర్గట్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సోమ దేవరెడ్డి,మాజీ జడ్పిటీసీ సభ్యుడు గుల్లే రాజేశ్వర్,బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అడెం గంగాప్రసాద్,ఏర్గట్ల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రేండ్ల రమేష్, పార్టీ నాయకులు ఎండి మునీర్,రవి రెడ్డి,దిబ్బ శీను,లింగారెడ్డి,శాంసన్ గజేందర్,రొక్కెడ సంజీవ్,లూన సాయన్న,తుపాకుల శ్రీనివాస్ గౌడ్,దొబ్బల మహేష్,తదితరులు ఉన్నారు.

## గుమ్మిర్యాల్ గ్రామాన్ని సందర్శించిన ఎంపీవో



**కరపత్రం ప్రతినిధి ఏర్గట్ల,జూలై 02 :**
మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామాన్ని ఏర్గట్ల ఎంపీవో శివ చరణ్ బుధవారం సందర్శించారు.స్థానిక గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేసి,శానిటేషన్ పనులు,మొక్కల నర్సరీ,ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించారు.పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ,కారోబార్ మారుతీ,తదితరులు ఉన్నారు.

## నారాయణ పాఠశాలలో ఇంట్రో ఆఫ్ రెడ్ కలర్ డే సెలబ్రేషన్



**కరపత్రం ప్రతినిధి నిజామాబాద్ టౌన్,జులై 02 :**
ఆర్మూర్ పట్టణంలోని నారాయణ పాఠశాలలో ఈ కిడ్స్ "ఇంట్రో ఆఫ్ రెడ్ కలర్ డే" ని జరుపుకొన్నారు.ఈ వేడుకలో చిన్నారులందరు చక్కటి ఎరుపు రంగు దుస్తులతో విచ్చేసి అందరినీ అలరించారు.ఈ కార్యక్రమంలో నారాయణ పాఠశాలల జి.ఎం.గోపాల్ రెడ్డి,డి.జి.ఎ.రమణ రెడ్డి,నిజామాబాద్ జిల్లా ఏజిఎం శివాజీ,ప్రిన్సిపాల్ రజనీ కుమారి,కో-ఆర్డినేటర్ కల్పన వైస్ ప్రిన్సిపాల్ స్రవంతి పాల్గొని చిన్నప్పటి నుండి చిన్నారులకు ఇలాంటి కార్యక్రమాలపై అవగాహన అయ్యేవిధంగా బోధన చేయడం జరుగుతుందని తెలిపారు.

# దేశానికి మోడల్‌గా

## తెలంగాణ డిజాస్టర్ మేనేజిమెంట్

మొదటి పేజీ తరువాయి
ప్రకృతి వైపరీత్యాలను సమర్ధవంతంగా ఎదుర్కొని వీలైనంత వరకు ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా ఉండేలా తెలంగాణ డిజాస్టర్ మేనేజిమెంట్ అధారిటీని బలోపేతం చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దేశానికి ఒక మోడల్‌గా ఉండేలా వ్యవస్ధను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణా సంస్ధ ను పునర్వ్యస్ధీకరించినట్లు వెల్లడించారు. ఈ సంస్ధకు గౌరవ ముఖ్యమంత్రి ఛైర్మన్‌గా ఉంటారని ఇందులో రెవెన్యూ, హోమ్, ఆర్ధిక, వైద్య ఆరోగ్యం, భారీ నీటిపారుదల, రహదారులు భవనాలు, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ది శాఖల మంత్రులు సభ్యులుగానూ, చీఫ్ సెక్రటరీ మెంబర్ కన్వీనర్‌గాను, రెవెన్యూశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ప్రత్యేక ఆహ్వానితునిగా ఉంటారని తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో గోదావరి మరియు కృష్ణా నదీ పరివాహక జిల్లాల్లో వరద నిర్వహణపై ఆయా జిల్లాల కలెక్టర్లు , ఇతర ఉన్నతాధికారులతో చీఫ్ సెక్‌లటరీ కె. రామకృష్ణారావు, విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ 'వాతావరణ మార్పుల వల్ల ఆకస్మికంగా వచ్చే వరదలు, వర్షాల సమాచారాన్ని ఐఎండీతో సమన్వయం చేసుకొని శాస్త్రీయంగా విశ్లేషించుకొని ఎప్పటికప్పుడు పై స్ధాయి నుంచి కింది స్ధాయి వరకు అందించేలా వ్యవస్ధను రూపొందించుకోవాలి. సమాచార వ్యవస్ధ మరింత బలోపేతం కావాలని అన్నారు. రాష్ట్ర స్ధాయిలో వర్షాలు, వరదలకు సంబంధం ఉన్న ఇరిగేషన్, విద్యుత్, హెల్త్, వ్యవసాయం, పోలీస్, రవాణా తదితర విభాగాలకు ప్రత్యేక నోడల్ అధికారులను నియమిస్తున్నాం. ప్రకృతి వైపరీత్యాలను మనం అడ్డుకోలేం కానీ వాటి ప్రభావాన్ని తగ్గించడానికి ముందస్తుగా పటిష్టమైన చర్యలు తీసుకుంటే నష్టాన్ని వీలైనంతవరకు తగ్గించగలుగుతాం. ప్రధానంగా కృష్ణా గోదావరి పరీవాహక ప్రాంతాల అధికార యంత్రాంగం వరద ముంపును ముందుగానే గుర్తించి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. దీనివలన మనం నష్టాన్ని తగ్గించినవారమవుతాం అన్నారు.నదీపరివాహక ప్రాంతాల్లో ఏ మేరకు వరద ఉధృతి వస్తే ఏఏ గ్రామాలు ముంపునకు గురౌతాయోనన్న సమాచారాన్ని నీటిపారుదల శాఖ ముందుగానే అందించాలి. ఇతర రాష్ట్రాలలో వచ్చే వరద వివరాలు, స్ధానికంగా పడిన వర్షం వివరాలు, ఎంత నీటిని విడుదల చే?స్తారనే విషయాలు సవివరంగా ఉండాలి. నదీ పరివాహక ప్రాంతాల్లోని నివాసితులను వరదలు వచ్చిన ప్రతిసారీ సురక్షిత ప్రాంతాలకు తరలించడం కంటే వారికి శాశ్వత నివాసం కల్పించాలి. ఇందుకు సంబంధించి నివాసితుల వివరాలను గుర్తిస్తే అదనపు కోటా కింద ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తామని తెలిపారు. భారీ వర్షాలు, వరదల సమయంలో వాగుల్లో వంకల్లో చెరువుల్లో చిక్కుకున్నవారిని రక్షించడానికి ఎయిర్ లిఫ్ట్ మెకానిజాన్ని సిద్దం చేసుకోవాలి. ఈ ఎయిర్ లిఫ్ట్ వ్యవస్ద సరిగా లేకపోవడం వల్ల గత ఏడాది నా నియోజకవర్గం పాలేరులో చిక్కుకున్న బాధితులను రక్షించుకోలేకపోయానని ఈ సందర్భంగా మంత్రిగారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎయిర్ లిఫ్ట్ మెకానిజం ఏవిధంగా ఉండాలి, విపత్తు సంభవించిన ప్రాంతానికి ఏవిధంగా చేరుకోవాలి వంటి అంశాలపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, సెక్రటరీ శివశంకర్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, పంచాయితీరాజ్ కమిషనర్ సృజన, సిపి డిసిఎల్ డైరెక్టర్ ముష్రాఫ్ అలీ, వ్యవసాయ సహకార శాఖ డైరెక్టర్ బి. గోపి. ఐఎండీ అధికారిణి నాగరత్నం. సివిల్ సప్లయిస్ డైరెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# బిసి రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి
42 శాతం బీసీ రిజర్వేషన్లు ఆమోదం పొందిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విలేకర్లతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చేందుకు జులై 17వ తేదీన రైలు రోకో కార్యక్రమానికి పిలుపు నిచ్చామని తెలిపారు. ఈ రైలు రోకోలో అత్యధిక సంఖ్యలో పాల్గొని.. బీసీ రిజర్వేషన్లు ఉద్యమానికి మద్దతు తెలపాలంటూ ఖమ్మం జిల్లా ప్రజలకు ఈ సందర్భంగా ఆమె పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్క బీసీ బిడ్డ పాల్గొనాలన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత తెలంగాణ రాష్ట్ర నూతన బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన రామచందర్‌రావుదే బాధ్యత అని కవిత స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా రైలు రోకోకు బీఆర్ఎస్ పార్టీ పిలుపు నిచ్చింది. అందులోభాగంగా ఇటీవల అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్సీ కవిత విడుదల చేశారు.

ఖమ్మం జిల్లా అంటేనే ఉద్యమాల ఖిల్లా అని గుర్తు చేశారు. అయితే వైరా నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల గురించి ఆలోచించండి.. అంతేకానీ బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసుల గురించి కాదంటూ కాంగ్రెస్ పార్టీ నేతలకు కవిత చురకలంటించారు. పోలవరం - బనకచర్ల నీటి విషయంలో ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రులు మాట్లాడాలని ఈ సందర్భంగా కవిత డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ ఇస్తామని అనేక సభలలో ఆ పార్టీ నేతలు హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ మరణం బీఆర్ఎస్ పార్టీతోపాటు ఖమ్మం జిల్లాకు తీరని లోటన్నారు. మదన్ లాల్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని చెప్పారు. మదన్‌లాల్ కుటుంబానికి తమ పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా కవిత భరోసా ఇచ్చారు.

## పట్టణ కూలీలకు 'ఆత్మీయ భరోసా' ఎందుకు వర్తింపజేయట్లేదు?: హైకోర్టు

మొదటి పేజీ తరువాయి
హైదరాబాద్: రాష్ట్రంలోని పట్టణ కూలీలకు 'ఆత్మీయ భరోసా' ఎందుకు వర్తింపజేయట్లేదని ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలక కార్యదర్శికి ఉన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. దీనిపై నాలుగు వారాల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను ఈనెల 29కి హైకోర్టు వాయిదా వేసింది.
పట్టణ కూలీలకు ఆత్మీయ భరోసా అమలు చేయాలని గతంలో హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ఆదేశాలను అమలు చేయడం లేదంటూ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. నారాయణపేటకు చెందిన శ్రీనివాస్ ఈ పిటిషన్ వేయగా.. ఆయన తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు.

# తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నాం



మొదటి పేజీ తరువాయి
ఇకపోతే గోశామహల్ లో నూతన ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించబోతున్నామని.. పనులు కూడా ప్రారంభమయ్యాయని అన్నారు. నిర్మాణంలో ఉన్న వివిధ ఆసుపత్రులు పూర్తయితే మొత్తం 7 వేల పడకలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నామని.. అందులో హెల్త్ టూరిజం ఒక చాప్టర్‌గా ఉంటుందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను హెల్త్ టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామని.. అందులో భాగంగానే డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని క్యాన్సర్ కేర్ సలహాదారుడిగా నియమించామన్నారు. తెలంగాణ రాష్ట్రం చేపట్టే ప్రణాళికలో డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని కూడా భాగస్వాములు కావాల్సిందిగా ముఖ్యమంత్రి కోరారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 10 లక్షల వరకు ప్రభుత్వం పేదలకు ఉచిత వైద్యం అందిస్తోందన్నారు. సమస్య రాకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాల్సిన అవసరం ఉందని.. ఇందుకు సరైన విధానంతో ముందుకు వెళుతున్నామని వెల్లడించారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు హెల్త్ ప్రొఫైల్ కార్డును క్రియేట్ చేయాలని భావిస్తున్నామన్నారు. ఒక యూనిక్ ఐడీతో ఈ హెల్త్ ప్రొఫైల్ కార్డులు ఉంటాయని తెలిపారు. వైద్య రంగం అభివృద్ధికి రూ.11500 కోట్లు కేటాయించామని.. రూ.21500 కోట్లు విద్యా రంగం అభివృద్ధికి కేటాయించామని తెలిపారు. పేదలకు ఉచిత వైద్యం, నాణ్యమైన విద్య అందించాలనే ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాని పేర్కొన్నారు. వైద్యులు ఏడాదిలో ఒక నెల రోజులు సామాజిక బాధ్యతగా ప్రభుత్వ ఆసుపత్రులలో సేవలందించాలన్నారు. సాంకేతిక రంగంలో ప్రపంచంలో హైదరాబాద్ కూడా ఒక వేదికగా మారిందని అన్నారు. మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి హైదరాబాద్‌కు డైరెక్ట్ కనెక్టివిటీ పెంచేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతున్నామని.. కనెక్టివిటీ పెరిగితే హైదరాబాద్ మరింత అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# చేనేత కార్మికుల రుణమాఫీకి 33 కోట్లు

మొదటి పేజీ తరువాయి
వెరిఫికేషన్ పూర్తయిన వెంటనే కార్మికుల ఖాతాలలో రుణమాఫిని జమ చేయడం జరుగుతుందని అన్నారు. రుణ మాఫీ జరిగిన అనంతరం చేనేత కార్మికులు కోరుకుంటే బ్యాంకర్లు మళ్లీ ఆ మేరకు రుణాన్ని బ్యాంకులు మంజూరు చేస్తాయని మంత్రిగారు పేర్కొన్నారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి చేనేత కార్మికుల సంక్షేమం కోసం దాదాపు 920 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. చేనేత కార్మికులకు ఎల్లప్పుడు పనికల్పించాలనే ఉద్దేశ్యంతో అన్ని ప్రభుత్వ శాఖలు ÷ఉఅక్ష నుండే వస్త్రాలు కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చినట్టు, అందుకు అనుగుణంగా ఇప్పటికే 579 కోట్ల విలువైన వస్త్రాలకు వివిధ ప్రభుత్వ శాఖల నుండి ఆర&ధర్లు వచ్చాయని అన్నారు. ఇందిరా మహిళాశక్తి చీరల పథకం ద్వారా సిరిసిల్లలోని 16 వేల మరమగ్గాలకు నిరంతరం పని కల్పించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. 193 కోట్లు చేనేత అభయహస్తం పథకాన్ని అమలు చేస్తున్నామని, గత ప్రభుత్వం కార్మికులకు చెల్లించకుండా వదిలేసిన 290 కోట్లను నేతన్నకు చేయూత పథకం కింద కార్మికుల ఖాతాలలో జమ చేశామన్నారు. మా ప్రభుత్వం చేనేత కార్మికుల అభివృద్ధి కోసం కట్టుబడి ఉందని ఆయన ఈ సందర్భంగా మరోసారి తెలియజేశారు.

# రాష్ట్రానికి తగిన యూరియా కేటాయించండి

మొదటి పేజీ తరువాయి
రాష్ట్రానికి సరిపడేంత యూరియాను కేటాయించాలని కోరుతూ కేంద్రానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. యూరియా కొరతను అధిగమించేందుకు తక్షణం చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రి జగత్ ప్రకాశ్‌నడ్డాకు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు మంత్రి లేఖలు రాశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రాష్ట్రంలో యూరియా అవసరం అంతకంతకు పెరిగిపోయిందని తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి రాష్ట్రానికి 5 లక్షల మెట్రిక్ టన్నుల కోటాను కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిందని.. అందులో ఇప్పటి వరకు 3.06 లక్షల టన్నుల యూరియా రాష్ట్రానికి సరఫరా అయిందని చెప్పారు.అరకొర సరఫరా కారణంగా రాష్ట్రంలో దాదాపు 1.94 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొరత ఏర్పడిందని చెప్పుకొచ్చారు. తాజాగా జులై నెలకు నిర్దేశిరచిన సప్లై ప్లాన్ ప్రకారం రాష్ట్రానికి 1.60 లక్షల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉందన్నారు. కానీ అందులో 60 శాతం ఇంపో÷-టర్గ÷డ్? యూరియాను కేటాయించటం ఆందోళన కలిగిస్తోందని లేఖలో పేర్కొన్నారు. దిగుమతుల ద్వారా రాష్ట్రానికి రావాల్సిన యూరియా సకాలంలో రాష్ట్రానికి చేరుకునే పరిస్థితి లేదని, ఇప్పటి వరకు ఆ యూరియాను రవాణా చేసేందుకు అవసరమైన నౌకల కేటాయింపు జరగలేదని లెటర్‌లో ప్రస్తావించారు. దీంతో ఖరీఫ్‌పంటలకు అనువైన సమయంలో యూరియా కొరత రైతులను ఆందోళనకు గురి చేస్తోందని మంత్రి తుమ్మల కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. యూరియా సరఫరాపై కేంద్రం తక్షణమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జులై నెలకు కేటాయించిన 0.97 లక్షల మెట్రిక్ టన్నుల ఇంపోర్టెడ్ యూరియాకు నౌకలను కేటాయించాలని కోరారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి తెలంగాణకు స్వదేశీ యూరియా సరఫరాను 30,800 టన్నుల నుంచి 60,000 టన్నులకు పెంచాలని వినతి చేశారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు తలెత్తిన యూరియా లోటును భర్తీ చేయడానికి అదనపు కోటాను కేటాయించాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు లేఖలో కోరారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం జూలై 03 2025

# అన్ని పార్టీల్లో పెరిగిపోయిన

# వాట్సప్ వీరులు .. సీనియర్ నాయకులు

శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్

రాజకీయాలకు అర్థం మారిపోయింది.గతంలో రాజకీయాలంటే సేవా భావము.ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడమే రాజకీయం అని ప్రజలు నాయకులు భావించేవారు.కానీ ఇప్పుడు అంతా తలకిందులైంది.రాజకీయాలంటే డబ్బు సంపాదనకు మార్గము, రాజకీయాలంటే పేరు ప్రతిష్టలకు వేదిక అని భావిస్తున్నారు.దేశంలో, ముఖ్యంగా మన తెలంగాణ రాష్ట్రంలో రాజకీయాల పరమార్థం డబ్బు సంపాదన మాత్రమే అని జనం భావిస్తున్నారు.

### - సాంకేతికత పెరిగింది పని తగ్గింది

ప్రచార సాధనాలు, ప్రసార సౌలభ్యాలు లేని కాలంలో రాజకీయ పార్టీ కార్యకర్త నాయకుడు ప్రతి వ్యక్తిని కలిసి ప్రతి ఇంటికి తిరిగి తన పార్టీ సిద్ధాంతాలు ఉద్దేశాలు వివరించి చెప్పేవాడు.
ఆ రకంగా ఒక వ్యక్తి పార్టీ ప్రతిష్టను పెంచి, తన ప్రాముఖ్యతను పెంచుకొని నాయకునిగా ఎదిగేవాడు. కాలం మారింది రాజకీయాలు కూడా మారిపోయాయి. నాడు ఎన్నికలలో కాలినడకన తిరిగి ప్రచారం చేసేవారు. సైకిళ్లపై తిరిగేవారు.తర్వాత కాలంలో జీపులు ప్రవేశించాయి.మైకులు ప్రవేశించిన తర్వాత జీపు ముందర మైకు కట్టి జీపు లోపల కార్యకర్తలు కూర్చుని డప్పులు మోగిస్తూ పాటలు పాడుతూ నినాదాలు ఇస్తూ మౌత్ పీస్ లో ప్రచారం చేసేవారు.

### - ఎన్టీఆర్ తో ఈ శైలి మారింది

1983 సంవత్సరంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించి చేసిన ప్రచారం కొత్త పుంతలు తొక్కింది.సినిమా తరహాలో పెద్ద పెద్ద కటౌట్లు, ప్రచార పోస్టర్లు, రికార్డింగ్ క్యాసెట్లతో ప్రచారాలు, వాహనాలకు కటౌట్లు కట్టి రథాలుగా తయారుచేసి ప్రచారం చేయడం ప్రారంభమైంది.సాంకేతికత పెరిగిన తరువాత ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రం తో పాటు దేశమంతా ప్రచార శైలి మారిపోయింది.ఎన్టీఆర్ తన చరిష్మాతో మొదలుపెట్టిన ప్రచార శైలిని అందరూ అనుసరించడం మొదలుపెట్టారు.

### - దేశంలో ఇందిరా గాంధీ, రాష్ట్రంలో ఎన్టీఆర్

దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి ఉన్న యంత్రాంగం తో పాటు ఇందిరా గాంధీకి ఒక చరిష్మా ఉండేది.
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక్క ఎన్టీఆర్ కు మాత్రమే ఆ చరిష్మా ఉండింది.ఆంధ్ర ప్రదేశ్ లో అప్పుడు కాంగ్రెస్ తిరుగులేని పార్టీ.కాంగ్రెస్ ను ఇందిరా గాంధీని ఢీకొట్టగలిగే మొనగాడు అప్పుడు ఎన్టీఆర్ మాత్రమే.సినిమా నటుడిగా ఎన్టీఆర్ కు ఉన్న అపార ఇమేజ్ ను రాజకీయాలకు మళ్లించి తెలుగుదేశం పార్టీని ఒక కోటగా మలిచాడు. కాంగ్రెస్ ను మట్టి కరిపించాడు.ఎన్టీఆర్ కు ఉన్న ఇమేజ్ తో ఊరు పేరు లేని వ్యక్తులు కూడా నాయకులు గా ఎదిగారు.

### - సాంకేతికత పెరిగింది బద్ధకం పెరిగింది

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కేవలం వ్యక్తిగత ప్రతిభతో జైపాల్ రెడ్డి, వెంకయ్య నాయుడు నాయకులుగా ఎదిగారు. వీరిద్దరూ కాంగ్రెస్సేతర నాయకులు.అకస్మాత్తుగా ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించడంతో వీరికి సవాల్ ఎదురైంది.ఎన్టీఆర్ చరిష్మాతో నాయకులుగా ఎదిగి, రాజకీయ అధికారం సాధించడం వల్ల ప్రజాక్షేత్రంలో కష్టపడి పనిచేసే అవసరం లేదని చాలా మంది భావించడం ప్రారంభమైంది.పార్టీ టికెట్టు దొరికితే చాలు ఇక గెలిచినట్టే, అధికారం సాధించినట్టే అనే ధోరణి ప్రబలిపోయింది. దీంతో సైద్ధాంతిక రాజకీయాలు చులకన చేయబడ్డాయి.

### - ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు రాజకీయ అధికారానికి ఎరువుగా మారి పోయాయి

తెలుగు దేశం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలతో పాటు, ఉచితాలు ఓట్లను ఆకర్షించే అయస్కాంతాలుగా మారిపోయాయి.ఈ ఉచితాలతో ఆయాచితంగా ఓట్లు లభించడం వల్ల పార్టీ క్యాడర్ కు పోరాటాలు చేసే బాధ తప్పింది.ఈ ఉచితాల ప్రభావం రాష్ట్ర ఆర్థిక స్థితి దెబ్బతినడం కూడా జరిగింది.అది ఇంకా కొనసాగుతున్నది. తెలంగాణలో బిఆర్ఎస్ మరియు కాంగ్రెస్ పార్టీ కూడా ఈ ఉచితాల దయతో ఓట్లు సంపాదిస్తున్నాయి.కాబట్టి పార్టీల కార్యకర్తలు నాయకులు ప్రజా సమస్యల పట్ల పోరాటం చేయటం గానీ,జనంలో పని చేయనవసరం గానీ లేకుండా పోయింది.ఇక తెలుగుదేశం దెబ్బతో .. కమ్యూనిస్టు పార్టీలు కనుమరుగైపోయాయి. అప్పుడప్పుడే ఊపిరి పోసుకుంటున్న బిజెపి ఎదుగుదల మందగించింది. కాంగ్రెస్ పార్టీ కుదేలైంది.తెలుగుదేశం ప్రారంభంతో బడుగు బలహీన వర్గాల నుంచి చాలామంది రాజకీయ నాయకులుగా ఎదిగారు, రాజకీయ అధికారం సాధించారు. ఇక అప్పటినుంచి అధినేత ఆశీస్సులతో మాత్రమే పనిచేసే వారి సంఖ్య పెరిగిపోయింది.ప్రజాక్షేత్రంలో ప్రజా సమస్యలపై పోరాటాలు తగ్గిపోయాయి.ప్రచారం మాత్రమే రాజకీయంగా మారిపోయింది.

### - ఫేస్ బుక్ వాట్సాప్ లతో రాజకీయం మారింది

టీవీలు, సెల్ ఫోన్ లు వచ్చిన తరువాత క్షేత్రస్థాయి పని తగ్గిపోయింది. ప్రచారం సులభమయ్యింది. ప్రసార సౌకర్యం పెరిగిపోయింది.టీవీ డిబేట్ లలో ఎదుటి పార్టీని తోటలతో విమర్శించడం, అరవడం రాజకీయ నాయకులకు ఒక అర్హతగా మారిపోయింది.సోషల్ మీడియాలో ఇష్టమొచ్చినట్టుగా సొల్లు పోస్టులు పెట్టుకునే కల్చర్ ప్రారంభమైంది.

### - టి.ఆర్.ఎస్ తో తిట్ల రాజకీయం ప్రారంభమైంది

అప్పటివరకు రాజకీయ ప్రత్యర్థులు, పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకోవడం సాధారణంగా ఉండేది. సద్విమర్శలు చేసుకునేవారు.

### - కానీ తెలంగాణ రాష్ట్ర సమితి ని ఒక ఉద్యమ పార్టీ అని ప్రకటించిన కల్వకుంట చంద్రశేఖర రావు విమర్శ రాజకీయాలను తిట్ల రాజకీయాలుగా మార్చి వేశాడు

తెలంగాణ రాష్ట్ర సాధన ఏకైక లక్ష్యంగా పోరాటాన్ని ప్రారంభించిన కెసిఆర్ తన ఉపన్యాసాలలో ఒక విశేష తిట్ల శైలిని ప్రవేశపెట్టాడు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వెంకయ్య నాయుడు ది ఒక ప్రత్యేక శైలి. అలాగే కేసిఆర్ ది తెలంగాణ లో ఒక విశేష శైలి.వీరిద్దరూ తమ వాక్పటిమతో తమ లక్ష్యసాధనలో ఎదిగిన వారే.వీరిద్దరికీ ఒక ఆశయం ఉంది. కానీ వీరి అనుచరులు మాత్రం



వాట్సప్ వీరులు ... సీనియర్ నాయకులు

ప్రచారాని నమ్ముకున్న జీవులుగా మారిపోయారు.తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జరిగిన తరువాత అటు ఏపీలో ఇటు తెలంగాణలో కాంగ్రెస్ అధికారానికి దూరమయింది.ఆంధ్రప్రదేశ్ లో రెండు ప్రాంతీయ పార్టీలు తెలంగాణలో ఒక ప్రాంతీయ పార్టీ బలంగా ఎదిగి నిలుచున్నాయి.రెండు జాతీయ పార్టీలైన కాంగ్రెస్ బిజెపి ల ఉనికి నామమాత్రంగా మారిపోయింది.

### - ఎలాగోలా తెలంగాణలో పదేళ్ల తర్వాత కాంగ్రెస్ మళ్లీ అధికారం సాధించింది. ఆంధ్రప్రదేశ్ లో కూటమిలో భాగస్వామిగా బిజెపి తన ఉనికిని పెంచుకుంటున్నది

కానీ తెలంగాణలో బిజెపి పోరాడుతూనే ఉంది. కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి ఒక విభిన్నమైన రాజకీయ పార్టీగా ప్రజలతో గుర్తించబడుతున్నది.కాంగ్రెస్ పార్టీ కి మళ్లీ జవజీవాలు అందించడానికి రాహుల్ గాంధీ పాత సెక్యులర్ శైలిలో పయనిస్తున్నాడు.కేంద్ర రాష్ట్ర స్థాయిలో ఆయా పార్టీల నాయకత్వాలు శక్తి వంచన లేకుండా కృషి చేస్తూనే ఉన్నాయి.కానీ కింది స్థాయిలో అన్ని పార్టీల కార్యకర్తలు మాత్రం, కేవలం సోషల్ మీడియా వీరులుగా మారిపోయారు.

### - అన్ని పార్టీల్లో ఇదే తీరు

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవాన్ని అందించడానికి రాహుల్ గాంధీ "భారత్ జోడో యాత్ర"తో కష్టపడుతున్నాడు.భారతీయ జనతా పార్టీని అజేయంగా నిలపడానికి నరేంద్ర మోడీ విశ్రాంతి లేకుండా కృషి చేస్తున్నాడు.కాంగ్రెస్ పార్టీ తన సెక్యులర్ రాజకీయ విధానంతో పనిచేస్తుంటే, బిజెపి విభిన్న పార్టీగా చెప్పుకుంటూ పనిచేస్తున్నది.

### - నాయకత్వం పనిచేస్తున్నది .. క్యాడర్ పడుకున్నది

దేశం విషయం పక్కన పెడితే, తెలంగాణ రాష్ట్రంలో అన్ని పార్టీల్లో క్యాడర్ కేవలం కాగితం పులులుగా, ప్రచార జీవులుగా మారిపోయారు.క్షేత్ర స్థాయి పని పక్కనబెట్టి, పార్టీ కార్యక్రమాలను, సిద్ధాంతాలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ మురిసిపోతున్నారు.

### - కాంగ్రెస్, బిజెపి, బి.ఆర్.ఎస్ పార్టీల క్యాడర్ ఫేస్ బుక్ లో ముఖ్యంగా వాట్సప్ లో పోస్టులు పెట్టి ఫోజులు కొట్టడం ఎక్కువైంది

తెలుగుదేశం ప్రవేశ పెట్టిన టెక్నికల్ ప్రచారం, బి.ఆర్.ఎస్ తిట్ల ప్రచారం ను కాపీ కొట్టడమే రాజకీయం అనే ధోరణి ప్రబలిపోయింది.తెలంగాణలో తెలుగుదేశం కుంచించుకుపోయింది. టిఆర్ఎస్ అలియాస్ బి ఆర్ ఎస్ ఇప్పుడు కుదేలయింది.అధికారానికి దూరమైన బి.ఆర్.ఎస్ తనదైన శైలిలో కష్టపడుతున్నది. అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ కూడా కష్టపడుతున్నది. కానీ,తెలంగాణలో ఎదుగుతున్న బిజెపి అధికారం కొరకు పరుగెడుతుంటే సీనియర్ నాయకులు సోషల్ మీడియాలో కాలక్షేపం చేస్తున్నారు.బీజేపీతో పాటు అన్ని పార్టీల కార్యకర్తలు "చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకుంటున్నారు".

### - సోషల్ మీడియా ప్రచారం మాత్రమే రాజకీయమా?


అంటే అవుననే సమాధానం వస్తుంది.కాంగ్రెస్, బి.ఆర్.ఎస్ పార్టీలు అధికారాన్ని అనుభవించాయి. తెలంగాణలో బిజెపికి ఇంకా అధికారం దక్కలేదు.కానీ బిజెపి కార్యకర్తలు మాత్రం మైకంలో ఉన్నట్టుగా అనిపిస్తున్నది.మోడీ నామ జపం మాత్రమే అధికారం అందిస్తుందని బిజెపి కార్యకర్తలు భ్రమ పడుతున్నారు. క్షేత్ర స్థాయిలో పని చేయకున్నా జనం ఓట్లు వేస్తారని భావిస్తున్నట్టుంది.

### - రాజ్యం వీర భోజ్యం

పార్టీ సిద్ధాంతం కోసం పనిచేయడం, పార్టీని అధికారంలోకి తీసుకురావడం ఒక క్లిష్టమైన కార్యం.
కాంగ్రెస్, బి.ఆర్.ఎస్ పార్టీలు అధికారం ను చవిచూసాయి.ఈ రెండు పార్టీలకు తెలంగాణలో అధికార రాజకీయం చేసే మెలకువలు అలవడ్డాయి. బిజెపికి ఇంకా ఆ అవకాశం రాలేదు.అధికారం అందుకోవడం అంటే అంతులేని పోరాటాన్ని చేయడం.తెలంగాణలో బిజెపి కార్యకర్తలు కమ్యూనిస్టు పార్టీ లాగా పడికట్టు నినాదాలకే పరిమితమైనట్టు కనిపిస్తున్నది.కమ్యూనిస్టులకు ఇప్పటికీ అధికారం దక్కలేదు. బిజెపికి ఆ అవకాశం ఇంకా రాలేదు.బిజెపి కేంద్ర నాయకత్వం, రాష్ట్ర నాయకత్వం అలుపెరుగని పోరాటం చేస్తూనే ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర బిజెపి నాయకత్వం పార్టీకి ఒక ఉనికిని సాధించి పెట్టాయి.తెలంగాణలో 8 ఎంపీ సీట్లు సాధించి బిజెపి బలమైన ఉనికిని నెలకొల్పింది రాష్ట్ర కేంద్ర బిజెపి నాయకత్వం. గెలుపు కొరకు బిజెపి పార్టీ క్యాడర్ కూడా పనిచేసిన మాట వాస్తవం.కానీ, సాధించిన దానికి సంతృప్తి పొందిన బిజెపి కార్యకర్తలు లక్ష్యాన్ని మరచిపోయినట్టుగా కనిపిస్తున్నది.

### - బిజెపిలో అందరూ సీనియర్ నాయకులే

మిగతా పార్టీల సంగతి ఎలా ఉన్నా బిజెపిలో మాత్రం కార్యకర్తలు కేవలం వాట్సాప్ వీరులుగా మారిపోయారని జనం భావిస్తున్నారు.బిజెపిలో చేరుతున్న నూతన నాయకులు అధికార అందలాలు ఎక్కుతున్నారు.బిజెపికి ఆ నాయకుల అవసరం కూడా ఉన్నది.ఎందుకంటే అన్ని నియోజక వర్గాల్లో పోటీ చేసే నాయకుల కొరత ఉందన్న విషయం బహిరంగ రహస్యం.నాయకుల కొరత ఉన్నప్పటికీ, పాత తరం బిజెపి కార్యకర్తలు పార్టీ ఉనికి కొరకు, గెలుపు కొరకు నిరంతరం పని చేస్తూనే ఉంటారు. బిజెపి కార్యకర్తలు సిద్ధాంత నిబద్ధత కలిగి ఉన్నవారు అనే పేరు ప్రజల్లో ఉన్నది. అది నిజం కూడా.బిజెపి ప్రవచించే జాతీయ వాదం కొరకు ప్రాణాలను కూడా లెక్క చేయకుండా పని చేసేబిజెపి కార్యకర్తలు ఆర్థికంగా వెనకబడిపోయారు.మారిన రాజకీయాల్లో డబ్బు పాత్ర ప్రధానంగా మారింది. డబ్బుతో రాజకీయాలు చేయలేని కార్యకర్తలు కేవలం కార్యకర్తలుగా మిగిలిపోయారు.అధికార రాజకీయాలకు డబ్బు అవసరం కాబట్టి ఆర్థిక వనరులు పుష్కలంగా ఉన్న కొత్త నాయకులు బిజెపికి అవసరం ఉన్నది.ఈ లోటును పూడ్చి, తెలంగాణలో ఏ విధంగానైనా అధికారం దక్కించుకోవాలని బిజెపి నాయకత్వం తీవ్రంగా కృషి చేస్తున్నది. బిజెపి ఆశయాల సాధన కొరకు పనికి వచ్చే కొత్త నాయకుల అన్వేషణ చేస్తున్నది. అలా వచ్చిన కొత్త నాయకులతో పాటు,వారి అనుయాయులైన కొత్త




కార్యకర్తలు కూడా బిజెపి కి వస్తున్నారు.ఈ కొత్త తరం నాయకులు మిగతా పార్టీల మాదిరిగా స్వంత ప్రయోజనాల కొరకు మాత్రమే పనిచేస్తున్నారన్న విషయం వాస్తవం.
ఈ కొత్త తరం బిజెపి కార్యకర్తలకు బిజెపి సిద్ధాంతాలు అవసరం లేదని భావిస్తున్నట్టున్నారు.
ఈ కొత్త కార్యకర్తల,పాత కార్యకర్తల మధ్య వ్యత్యాసం స్పష్టంగా తెలుస్తున్నది.

### - ఈ ధోరణి వల్ల బిజెపి క్యాడర్ లో నిర్లిప్తత ప్రవేశించింది

మిగతా పార్టీల సంగతి ఎలా ఉన్నా, భారతీయ జనతా పార్టీలో మాత్రం సైద్ధాంతిక నిబద్ధత చాలా ముఖ్యం. ఈ సిద్ధాంత నిబద్ధతనే బిజెపి ప్రత్యేకత.దశాబ్దాలుగా అలుపెరుగని పోరాటం చేసిన కార్యకర్తలు ఇప్పటికీ కార్యకర్తలు గా సంతృప్తిగానే పనిచేస్తున్నారు.బిజెపిలో కొత్తగా చేరిన వాళ్ళు మాత్రం సీనియర్ నాయకులు అని చెప్పుకోవడం కనిపిస్తున్నది.సీనియర్ నాయకుడు అని చెప్పుకోవడం కాంగ్రెస్ లో తక్కువ. పదేళ్లు అధికారం అనుభవించిన భారత రాష్ట్ర సమితి కార్యకర్తలు కూడా సీనియర్ నాయకులు అని ప్రకటించుకోవడం తక్కువ.

### - ఈ జాడ్యం బిజెపి లోనే ఎక్కువ కనిపిస్తున్నది

నిన్నటి వరకు కూడా బిజెపి కార్యకర్తలు ఎలాంటి ఫలితం ఆశించకుండా పనిచేశారు.
పార్టీని పెంచి పోషించారు. ఎన్నో త్యాగాలు చేసి కుటుంబాలకు అన్యాయం చేసి, సిద్ధాంతం కొరకు పని చేసిన బిజెపి కార్యకర్తలు ఎప్పుడూ పేరు ప్రతిష్టలు కోరుకోలేదు. బిజెపి క్యాడర్ ఏ పేరు ప్రఖ్యాతులు కోరుకోరని ప్రజలకు తెలుసు.కానీ, నిన్న మొన్న కార్యకర్తలుగా మారిన వారు "బిజెపి సీనియర్ నాయకులు" అని చెప్పుకోవడం బిజెపిలో ఒక వింత పరిణామం. ఈ పరిణామం ఒక వ్యాధి గా మారింది.

### - తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావాలంటే ఎమ్మెల్యేలు కావాలి

ఇంతకాలం పని చేయడం మాత్రమే తెలిసిన బిజెపి కార్యకర్తలు ఎవరు కూడా ఎమ్మెల్యే పోటీలో నిలువలేరు. దానికి కారణం ఆర్థిక లోపం.నమ్మిన సిద్ధాంతం కొరకు, దేశం కొరకు త్యాగ భావంతో పనిచేసిన కార్యకర్తలు తమ ఆర్థిక అభివృద్ధి కొరకు ఏ మాత్రము శ్రద్ధ వహించలేదు.కాబట్టి డబ్బు సంపాదన గురించి ఆలోచించలేదు.డబ్బు ప్రభావం అధికంగా ఉన్న ఎన్నికల రాజకీయాల్లో ఈ కార్యకర్తలు కేవలము పార్టీ పునాదులుగా మాత్రమే మిగిలిపోయారు,మిగిలిపోతున్నారు.

### - రాష్ట్ర నాయకుడు జాతీయ నాయకుడు ఎవ్వరైనా తమ తమ నియోజకవర్గాల్లో పట్టు లేనప్పుడు ఎన్నికల్లో గెలువ లేరు

అటువంటప్పుడు ఈ "సీనియర్ నాయకులు" ఉండీ ఉపయోగం ఏమిటి?.
బిజెపి కి తెలంగాణలో అధికారం కావాలి,కాబట్టి గెలుపు గుర్రాల కావాలి.
కాబట్టే బిజెపి అధికార సాధనకు ఎమ్మెల్యేలుగా గెలవ గలిగే నాయకుల అవసరం ఉన్నది.బిజెపికి ప్రజల్లో ఉన్న ఆదరణ గమనించిన వారు, గెలుస్తామని నమ్మకం ఉన్నవారు బిజెపిలో చేరడం అనివార్యం. బిజెపికి అసెంబ్లీ నియోజక వర్గ స్థాయిలో బలమైన నాయకులుంటే కొత్త వారి అవసరం లేదు. ఆ లోపం ఉంది కాబట్టే బిజెపికి బలమైన కొత్త నాయకుల అవసరం ఉన్నది.ఈ కొత్త నాయకుల అనుచరులే బిజెపికి దొరికిన రెడీ మేడ్ "సీనియర్ నాయకులు".

### - పార్టీ కంటే వ్యక్తిగత ప్రయోజనమే ముఖ్యం

### - కాంగ్రెస్, బి.ఆర్.ఎస్ పార్టీలలో కూడా ఈ వాట్సప్ వీరులు కనిపిస్తారు. కానీ బిజెపిలో అధికంగా కనిపిస్తున్నారు

బిజెపి లో చేరి ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా గెలిచిన వారికి ఉండే గ్లామర్ కింది స్థాయి కార్యకర్తలను ఆకర్షించడం కూడా సహజమే.కొత్తతరం బిజెపి కార్యకర్తలు ఈ నాయకుల వెంట తిరుగుతూ, ఫోటోలు తీసుకుంటూ వాట్సప్ లలో పెట్టుకోవడం ఎక్కువగా కనిపిస్తున్నది. భుజంపై నాయకుడి చేయి వేయించుకొని, ఫోటోలు తీసుకుని వాట్సప్ డీపీ లుగా పెట్టుకోవడం, వాట్సప్ గ్రూపుల్లో పెట్టుకోవడం ఎక్కువైంది. ఇది ఒక ప్రతిష్టగా భావించడం ఎక్కువైంది.బిజెపి ఎదుగుదలకు, పార్టీ స్థిరీకరణకు ఎన్నో త్యాగాలు చేసిన కార్యకర్తలు పునాదులలో మిగిలిపోయారు. కొత్త తరం సీనియర్ నాయకులు ఎక్కువయ్యారు.బిజెపి పార్టీ కొరకు దెబ్బలు తిని, కత్తిపోట్లకు గురై, ప్రాణ త్యాగాలు చేసి, నిష్కామకర్మ చేసినవారు ఎలాంటి గుర్తింపు కోరుకోకుండా ఇంకా కార్యకర్తలు గానే కొనసాగుతున్నారు. కానీ కొత్తగా వచ్చినవారు సీనియర్ నాయకులు అని ప్రకటించుకోవడం ఆశ్చర్యం కలిగిస్తున్నది.
కాంగ్రెస్ తో పాటు దేశంలోని మిగతా అన్ని పార్టీల కంటే కూడా బిజెపి విభిన్నమైన పార్టీ అని సగర్వంగా ప్రకటించుకుంటుంది.
• BJP ..The Party with a difference • అని బిజెపి సగర్వంగా చెప్పుకుంటుంది.బిజెపి విభిన్నత ఏమిటో ప్రతి కార్యకర్త తమ పనిలో చూపాలి.

### - తెలంగాణలో కాంగ్రెస్, బి,ఆర్,ఎస్ పార్టీలు అధికార రాజకీయాల్లో రాటు తేలిపోయాయి. బిజెపి పార్టీ ఇంకా శైశవ దశలోనే ఉంది

తెలంగాణ బిజెపి రాష్ట్ర నాయకత్వం ఇప్పుడు ఈ రాజకీయ మెలకువలను నేర్చుకున్నది.
జాతీయ నాయకత్వం బిజెపి రాష్ట్ర నాయకులకు ఆ తర్ఫీదు ఇస్తున్నది.కిందిస్థాయిలో బిజెపి కార్యకర్తలు కూడా ఆ మెలకువలతో పని చేయాలి.తమ పూర్వ కార్యకర్తలు బిజెపి పార్టీ ఎదుగుదలకు ఏ రకంగా పనిచేశారో గమనించాలి.
పాత తరం బిజెపి కార్యకర్తలతో సలహా సంప్రదింపులు జరపాలి.
వయస్సు మీద పడ్డ బిజెపి పాతతరం కార్యకర్తల అనుభవాలను అర్థం చేసుకోవాలి.
వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలి.
పాత తరం, కొత్త తరం కార్యకర్తల మేలు కలయిక బిజెపికి అవసరం. పనిచేసే కార్యకర్తలు మాత్రమే బిజెపి అవసరం. అదే బిజెపి కి శ్రీరామ రక్ష.బిజెపి విభిన్నమైన పార్టీ అని చాటడానికి బిజెపి కార్యకర్తలు విశేషంగా కృషి చేయాల్సిన అవసరం ఉన్నది.బిజెపి సిద్ధాంతాలను, వ్యూహాలను ప్రజలకు వివరించి పని చేయాల్సిన అవసరం ఉన్నది.
లేకపోతే బిజెపి కూడా గుంపులో గోవింద పార్టీగా మారే ప్రమాదం ఉన్నది.

### - తెలంగాణలో ఇప్పుడు ప్రముఖంగా కనిపిస్తున్న నాయకులు ఒకనాటి కార్యకర్తలు. తమ జీవితాలను ధారపోసి పార్టీని నిలిపిన నిజమైన కార్యకర్తలే ఇప్పుడు నాయకులుగా ఉన్నారు

అది ఇప్పటి బిజెపి కార్యకర్తలకు ఒక స్ఫూర్తి, దిక్సూచి. దున్నే వాడిదే భూమి,పని చేసే వాడిదే పార్టీ. ఈ సూత్రం అన్ని పార్టీలకు వర్తిస్తుంది.
ఏ పార్టీ అయినా,కార్యకర్తలు నాయకులుగా ఎదగాలని కోరుకుంటారు. తమ ఊరిలో వార్డు మెంబర్లుగా, కౌన్సిలర్లుగా, కార్పొరేటర్లుగా గెలవడం ప్రతి పార్టీకి అవసరం. బిజెపి కి ఇంకా ఎక్కువ అవసరం ఉన్నది.అలా గెలిచిన వారే నాయకులు అవుతారు. అలా ఎదిగిన నాయకులే రాష్ట్రస్థాయిలో, జాతీయస్థాయిలో వెలుగొందే అవకాశాలుంటాయి.

### - ఈ వాట్సప్ లేదా సోషల్ మీడియా ప్రచారాలు నీటి బుడగలు

ప్రజల్లో అభిమానం సంపాదించుకున్న వారు, అనుచరులను రూపొందించుకున్న కార్యకర్తలు మాత్రమే నాయకులుగా ఎదుగుతారు.
లేకపోతే సోషల్ మీడియా నాయకులు కార్యకర్తలుగా కూడా పనికిరారు.

### - సీనియర్ నాయకులు అని తమకు తామే ప్రకటించుకోవడం వల్ల ఏ ఉపయోగమూ లేదు

రాబోయే స్థానిక సంస్థల్లో గెలిచిన వారే నాయకులుగా మారే అవకాశమున్నది.
సర్పంచులుగా, మునిసిపల్ చైర్మన్ లుగా, జడ్పిటిసి లుగా గెలిచినవారు క్రమంగా ఎమ్మెల్యేలుగా మారే అవకాశం ఉన్నది.
నాయకుడిగా ఎదగాలనుకున్న ప్రతి బిజెపి కార్యకర్త కూడా తమ ఏరియాలో, నియోజక వర్గాల్లో ప్రజల మధ్య పట్టు సాధించి ప్రజా నాయకుడిగా ఎదగాలి.ఇది కేవలం బిజెపికి మాత్రమే వర్తించే సూత్రం కాదు. అన్ని పార్టీల్లో కూడా కార్యకర్తలు ఇలా అంకిత భావంతో పని చేసినప్పుడే తాము ఎదుగుతారు, పార్టీ ఎదుగుతుంది.తెలంగాణలో అధికారాన్ని చవిచూసిన కాంగ్రెస్, టిఆర్ఎస్ పార్టీలకు ఈ అధికార రాజకీయాల మేలుకువలు తెలుసు. ఏతావాతా తెలుసుకోవాల్సింది బిజెపి కార్యకర్తలు మాత్రమే.
నిన్న మొన్న బిజెపిలో చేరిన వారు సీనియర్ నాయకులు అని ప్రకటించుకోవడం ప్రజల్లో నవ్వు తెప్పిస్తున్నదన్న విషయం గమనించాలి.

### - సీనియర్ నాయకుడు అని చెప్పుకోవడానికి ఏమైనా కాలపరిమితి ఉందా? ఎంత కాలం పని చేస్తే సీనియర్ నాయకుడు అవుతాడు?

ప్రచారయావతో ఈ ఒక్కరూ నాయకులుగా ఎదగలేరు అనే విషయాన్ని గమనించి, ప్రజల్లో ఉన్నప్పుడే నిజమైన నాయకులుగా ఎదుగుతారు.నీళ్లలో ఉంటేనే మొసలికి బలం. జనంలో ఉంటేనే కార్యకర్తలకు బలం. ఆ బలమే నాయకత్వం. ఈ విషయం మరచిన వారు వాట్సప్ లో పెట్టుకునే పోస్టులు నీటి మీద రాతలు మాత్రమే. క్షేత్ర స్థాయిలో లేదా నియోజకవర్గాల్లో ప్రజా సమస్యలతో మమేకమైన వారు మాత్రమే నాయకులవుతారు.వారే సీనియర్ నాయకులు అవుతారు.

### - ఒక పార్టీలో లభించేది కేవలం బాధ్యత మాత్రమే. ఆ బాధ్యతను పదవిగా భ్రమించేవారు ఎప్పుడూ నాయకులు కాలేరు

పార్టీ బాధ్యతలు పదవులు కావు.ఆ బాధ్యతలను పదవులుగా భావించిన వాళ్లు కనుమరుగవుతారు.కాంగ్రెస్, టిఆర్ఎస్ పార్టీల కంటే బిజెపి భిన్నమైన పార్టీ అని చెప్పుకోవాలంటే, బిజెపి కార్యకర్తలు కూడా విభిన్నంగా పనిచేయాలి. అలుపెరగకుండా పనిచేయాలి.

### - వ్యక్తి ఆరాధనతో పని చేసే వ్యక్తి గాని, కార్యకర్త గాని నాయకుడిగా ఎదగలేడు

వ్యక్తి ఆరాధనను పక్కకు పెట్టి పార్టీ తత్వాన్ని ఆరాధించిన వాళ్లే నిజమైన నాయకులు. ఏ పార్టీ అయినా ఈ సూత్రమే ప్రధానమని కార్యకర్తలు గమనించాలి.

### - జనాలు సోషల్ మీడియా పోస్టులను చూసి,ఫ్లెక్సీలను చూసి కళ్ళు పక్కకు తిప్పుకుంటున్నారు

వాట్సప్ వీరులు, తమకు తామే "సీనియర్ నాయకులు" అని ప్రకటించుకోవడం మానేస్తే వాట్సప్ చూసే వాళ్లకు మనశ్శాంతిని ప్రసాదించిన వారవుతారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో పురోగతి సాధించాలి

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి...
-ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనుల ప్రగతిపై సమీక్ష...
- సీజనల్ వ్యాధుల నియంత్రణ,వనమహోత్సవం,ఎల్ఆర్ఎస్ అనుమతులపై అధికారులకు దిశా నిర్దేశం...









**కరపత్రం ప్రతినిధి నిజామాబాద్, జూలై 02 :** పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో పురోగతి సాధించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఆర్మూర్ మున్సిపాలిటీని సందర్శించి, పట్టణంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, వన మహోత్సవం, సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం చేపడుతున్న ముందస్తు చర్యలు, ప్లాట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తుదారులకు అనుమతుల మంజూరు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష జరిపారు. ఒక్కో వార్డు వారీగా ఆయా అంశాలలో ప్రగతిని సమీక్షించిన కలెక్టర్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో ప్రగతి ఆశించిన స్థాయిలో లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. 617 మందికి ఇళ్లను మంజూరు చేయగా, కేవలం 183 మాత్రమే గ్రౌండింగ్ జరిగాయని అధికారులు, వార్డు ఆఫీసర్ల పనితీరును ఆక్షేపించారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల లక్ష్యాన్ని ఎలా సాధిస్తారని నిలదీశారు. అలసత్వ వైఖరిని వీడాలని, ఇకనైనా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఇళ్లను నిర్మించుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు. అవసరమైతే ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుల సహకారం తీసుకోవాలని అన్నారు. ఇల్లు మంజూరు అయిన ప్రతి ఒక్కరూ నిర్మాణం చేపట్టేలా అవసరమైన తోడ్పాటును అందించాలని, ఏవైనా ఇబ్బందులు ఉంటే వాటిని పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఆర్థిక స్థోమత లేని లబ్దిదారులకు మెప్మా ఆధ్వర్యంలో రుణాలు ఇప్పించేలా చొరవ చూపాలని అన్నారు. ఒకవేళ ఎవరైనా మహిళా సంఘాలలో సభ్యులుగా లేనట్లయితే, వారిని సభ్యులుగా చేర్పించి రుణాలు మంజూరయ్యేలా కృషి చేయాలన్నారు. ఇప్పటికే సభ్యులుగా ఉన్న వారికి మూడు రోజులలో, కొత్తగా సభ్యత్వం కల్పించే వారికి వారం వ్యవధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం లక్ష రూపాయల వరకు రుణాలు మంజూరయ్యేలా చూడాలన్నారు. తాను వచ్చే వారం మళ్లీ సమీక్ష నిర్వహిస్తానని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన ప్రగతి కనిపించాలని అన్నారు. తీసుకున్న రుణాన్ని ఇంటి నిర్మాణానికి వెచ్చించేలా నిశిత పర్యవేక్షణ జరపాలని సూచించారు.కాగా, పచ్చదనాన్ని పెంపొందిస్తూ, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు వీలుగా ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను వెచ్చిస్తూ చేపడుతున్న వన మహోత్సవం కార్యక్రమం విజయవంతం అయ్యేలా ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ హితవు పలికారు. నర్సరీల్లో మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉంచాలని, వాటిని నాటి పరిరక్షించేలా అనువైన ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, వాటిని సంరక్షించే విధంగా పకడ్బందీ చర్యలు చేపట్టడం కూడా అంతే ముఖ్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. గత సీజన్ లో నాటిన మొక్కల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కడైనా మొక్కలు చనిపోతే వాటి స్థానంలో కొత్తగా మొక్కలు నాటాలని అన్నారు. మొక్కలను ఆయా కేటగిరీలుగా విభజిస్తూ, పూలు, పండ్ల మొక్కలను నివాస గృహాల కోసం పంపిణీ చేయాలని, మూడు మీటర్ల వరకు ఎత్తు కలిగిన మొక్కలను అవెన్యూ, బ్లాక్ ప్లాంటేషన్ ల కోసం వినియోగించాలని తెలిపారు. నాటిన ప్రతి మొక్క బతికేలా పక్కాగా సంరక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. నివాస ప్రాంతాల నడుమ ఖాళీ ప్రదేశాలలో నిలువ నీరు ఉండకుండా చూడాలని అన్నారు. దోమల వ్యాప్తిని నిరోధించేందుకు మురికి గుంతలలో ఆయిల్ బాల్స్ వేయాలని, మంచినీటితో కూడిన వనరులలో గంబుషియా చేప పిల్లలు వదలాలని సూచించారు. ప్రతి శుక్రవారం అన్ని నివాస ప్రాంతాల్లో, వ్యాపార వాణిజ్య సంస్థలలో విధిగా డ్రై డే పాటించేలా చూడాలన్నారు. ఎక్కడైనా మలేరియా, విష జ్వరాలు వంటి పాజిటివ్ కేసులు నమోదు అయితే, పరిసర ప్రాంతాల్లో దోమల నివారణ మందులు పిచికారీ చేయించాలని, స్థానికుల బ్లడ్ శాంపిల్స్ సేకరించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిపించాలని, అవసరమైన వారికి చికిత్సలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం నిర్ణీత రుసుము చెల్లించిన వారికి త్వరితగతిన క్రమబద్ధీకరణ అనుమతి మంజూరు చేయాలన్నారు. రెండు పడక గదుల ఇళ్లను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కేటాయించేలా అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని తెలిపారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పోర్టల్ లో లబ్దిదారుల వివరాలు వెంటదివెంట అప్డేట్ చేయాలని అన్నారు.సమీక్ష అనంతరం కలెక్టర్ ఆర్మూర్ పట్టణంలోని 11, 12 వార్డులలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన లబ్ధిదారులను వారి నివాసాల వద్దకు వెళ్లి కలిశారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మంజూరీ లభించినందున వెంటనే పనులు ప్రారంభించాలని హితవు పలికారు.ఆర్థిక ఇబ్బందులు వంటి సమస్యలు ఉంటే, మెప్మా ద్వారా రుణం ఇప్పిస్తామని,ఉచితంగా ఇసుక సరఫరా చేయిస్తామని,ఆయా దశల నిర్మాణాలను బట్టి వెంట వెంటనే రూ. 5 లక్షల ఆర్థిక సాయం ప్రభుత్వం అందిస్తోందని సూచించారు.కలెక్టర్ వెంట జిల్లా మలేరియా నియంత్రణ విభాగం అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్,ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు తదితరులు ఉన్నారు.

# రాష్ట్ర బిజెపి అధ్యక్షుడిని సత్కరించిన జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ కుమార్







కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర భారతీయ జనతాపార్టీ అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన రామచంద్రరావును గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ కుమార్ వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వేణుగోపాల్ రెడ్డి,జగదీష్ బాబు,సత్యమూర్తి,మక్కల నర్సింగ్,తదితరులు పాల్గొన్నారు.


# క్రీడా జర్నలిస్టు అజ్మత్ ఖాన్ కు ఘన సన్మానం



సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి

ప్రపంచ క్రీడా జర్నలిస్టుల దినోత్సవం సందర్భంగా ప్రముఖ క్రీడా జర్నలిస్టు అజ్మత్ ఖాన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,అజ్మత్ ఖాన్ క్రీడలపై చూపిన అభిరుచి,అంకితభావం అత్యంత ప్రశంసనీయమైనదని అన్నారు.ఆయన జర్నలిజం ద్వారా ఎంతో మంది క్రీడాకారులకు గుర్తింపు లభించిందన్నారు.ఇలాంటి వ్యక్తుల సేవలకు మరింత గుర్తింపు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా నిలిచిందని,యువ జర్నలిస్టులకు మార్గదర్శకంగా ఉంటుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో డి.వై.ఎస్.ఓ పవన్ కుమార్,పేట అధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి,టీజీ పేట గోపిరెడ్డి రాజేందర్,సాయిలు, ప్రశాంత్,ఫరూక్,వినోద్ నాయక్, వినోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# అంగన్వాడి టీచర్ల సమస్యలను పరిష్కరించాలని వినతి



**కరపత్రం ప్రతినిధి బాన్సువాడ జూలై 2** బాన్సువాడ డివిజన్ పరిధిలోని అంగన్వాడి టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఖలీల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా అంగన్వాడీ టీచర్ల సమస్యలను అధికారంలోకి రాగానే తీరుస్తామని చెప్పి, ఇప్పటివరకు సంబంధిత అధికారులు అంగన్వాడి కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. అలాగే అంగన్వాడి కేంద్రాల్లో ఆయాల కొరత ఉన్న కేంద్రాలకు ఆయాలను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షురాలు మహాదేవి, సెక్టర్ లీడర్ శివగంగ, రేణుక, గౌరమ్మ, శివ జ్యోతి, సవిత, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# పోల్ టాక్స్ రద్దు చేయాలి...

- ఏడికి వినతి పత్రం అందజేసిన కేబుల్ ఆపరేటర్ల సంఘం..

**కరపత్రం ప్రతినిధి బోధన్ జులై 02..** పోల్ టాక్స్ ను రద్దు చేయాలని కేబుల్ ఆపరేటర్ల సంఘం ప్రతినిధులు కోరారు. కేబుల్ టీవీ ఆపరేటర్లపై విద్యుత్ శాఖ అధికారులు పోల్ టాక్స్ రూపంలో మోపిన అదనపు భారాన్ని తగ్గించాలని రెంజల్ మండల కేబుల్ ఆపరేటర్ సంఘం తరఫున విద్యుత్ శాఖ అధికారికి బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేబుల్ ఆపరేటర్ అసోసియేషన్ అధ్యక్షులు సయ్యద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ కేబుల్ ఆపరేటర్లపై పోల్ టాక్స్ రూపంలో అధిక భారం మోపడం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోల్ టాక్స్ ను రద్దుచేసి ఆపరేటర్లను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఆపరేటర్లు కరపే నారాయణ, హరిబాబు, సంజీవ్ రెడ్డి, సయ్యద్ పాషా, జబ్బర్, ఐటి సాయిలు, తదితరులు పాల్గొన్నారు.


# నిరుపేద కుటుంబాలకు దోమతెరలు పంపిణీ...




**కరపత్రం ప్రతినిధి బోధన్ జూలై 02..** లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అయ్యప్ప సేవా ఆధ్వర్యంలో బుధవారం బోధన్ డివిజన్ సాలూర మండలంలోని కుమ్మన్ పల్లి గ్రామంలో నిరుపేద కుటుంబాలకు దోమతెరలు పంపిణీ చేశారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా నిరుపేదలకు దోమతెరలు పంపిణీ చేస్తున్నట్లు లయన్స్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అయ్యప్ప సేవ కార్యదర్శి కుమ్మరి పోశెట్టి, లయన్ కే.సవిత, మున్నూరు లక్ష్మణ్, దొడ్ల నారాయణరెడ్డి, ప్రోగ్రాం చైర్మన్ కుమ్మరి పోశెట్టి, కో చైర్మన్ కుమ్మరి సవిత తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ గా బక్కూరి పవన్ కుమార్

సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి



జిల్లా యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ గా బక్కూరి పవన్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు.పవన్ కుమార్ 2002 డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయునిగా చేరారు.వాలీబాల్ జాతీయ క్రీడాకారులు శెట్పల్లి గ్రామస్తుడు.ప్రస్తుతం జక్రాన్ పల్లి హై స్కూల్ లో ఫిజికల్ డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ,గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారుల నైపుణ్యం వెలికి తీసి వారికి సహాయ సహకారాలు చేస్తానని,తన బాధ్యతలను కర్తవ్యంగా నిర్వహిస్తానని హామీ ఇచ్చారు

## కేర్ డిగ్రీ కళాశాలలో ప్రాంగణ నియామకాలకు అనుహ్య స్పందన



**కరపత్రం ప్రతినిధి నిజామాబాద్ టౌన్,జులై 02 :** నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో మ్యాజిక్ బస్సు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు ఉద్యోగార్థుల నుండి అనూహ్య స్పందన వచ్చింది.దాదాపు 300 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా అందులో నుండి దాదాపు 40మందిని వివిధ ఉద్యోగాలకు సెలెక్ట్ చేయడం జరిగిందని కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్ తెలిపారు.ఇంటర్వ్యూలో వరుణ్ మోటార్స్,వైసిస్ క్లౌడ్ టెక్నాలజీస్, ముత్తూట్ ఫైనాన్స్,అపోలో ఫార్మసీ,జిఆర్ సర్వీసెస్,2050 హెల్త్ కేర్ సర్వీసెస్, హెచ్ డి బి ఫైనాన్షియల్ సర్వీసెస్ తదితర కంపెనీలు పాల్గొన్నాయి.మ్యాజిక్ బస్సు ఫౌండేషన్ నుండి రమేష్, నరేష్ లు ఈ జాబ్ మేళాను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్ తో పాటు కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్,నరేష్,శంకర్,సందేష్,సందీప్ తదితరులు పాల్గొన్నారు.